సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం : ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



మనీష్‌కు ఎల్ఓసీ అందజేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

కొత్తపేట, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు ప్రభుత్వం అందించే వరమని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి తెలిపారు. కొత్తపేట నాగేశ్వర్‌రావు కాలనీవాసి భాస్కర్‌రావు అనారోగ్యంతో ఇబ్బందులకు గురయ్యారు. ఆయన ఆస్పత్రి వైద్య ఖర్చుల నిమిత్తం ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి సీఎం రిలీఫ్ ఫండ్ రూ.2 లక్షలు మంజూరు చేయించారు. ఆదివారం ఆయన కుమారుడు మనీష్‌కు ఎమ్మెల్యే ఎల్ఓసీ అందజేశారు. పేద ప్రజలకు అధునాతన నాణ్యమైన వైద్య సేవలు పొందేందుకు సీఎం రిలీఫ్ ఫండ్ అండగా ఉంటుందని ఆయన అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ప్రతీక్, సింగిరెడ్డి వేణుగోపాల్‌రెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

చైతన్య మృతదేహం రప్పించడానికి కృషి: కిషన్‌రెడ్డి



కిషన్‌రెడ్డిని కలిసిన శ్రీరాములుయాదవ్, చైతన్య కుటుంబ సభ్యులు

సరూర్‌నగర్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): ఇటీవల లండన్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో దుర్మరణం పాలైన నాదర్‌గుల్‌కు చెందిన తర్రె చైతన్యయాదవ్ మృతదేహాన్ని త్వరగా ఇండియాకు రప్పించడానికి చర్యలు తీసుకుంటానని కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములు యాదవ్ ఆధ్వర్యంలో చైతన్య కుటుంబ సభ్యులు మంత్రిని ఆయన నివాసంలో కలిసి తమ ఆవేదన వ్యక్తం చేశారు. మృతదేహం ఇంకా ఇంటికి రాలేదని, దాంతో తమకు ఏం చేయాలో తోచడం లేదని మృతుడి కుటుంబ సభ్యులు వివరించారు. దీనికి కిషన్‌రెడ్డి స్పందిస్తూ సంబంధిత విభాగాల అధికారులతో మాట్లాడి వీలైనంత త్వరగా చైతన్య మృతదేహం ఇండియాకు వచ్చేలా చూస్తానని అన్నారు.

కాలనీలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి

చంపాపేట, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): హస్తినాపురం డివిజన్‌లోని వందనపురికాలనీలో ఆదివారం జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ మెంబర్, కార్పొరేటర్ సుజాతానాయక్ ఆయా శాఖల అధికారులతో కలిసి పర్యటించి ప్రజల నుంచి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ కాలనీలో ప్రజల కోరిక మేరకు మౌలిక సదుపాయాల కల్పనల కోసం కృషి చేయనున్నట్లు పేర్కొన్నారు. వర్షాలకు గుంతలమయంగా మారిన రోడ్లను వాహనదారులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు గోపీరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, కాలనీ ప్రతినిధులు కర్నాటి చండీశ్వర్, గుర్రం చంద్రశేఖర్, నర్సింహ, సతీష్‌గౌడ్ పత్యానాయక్, చల్లా వేణుగోపాల్‌రెడ్డి, యాదగిరి, లక్ష్మారెడ్డి, స్వామిరావు, విజయ్, శంకర్ పాల్గొన్నారు.

'శివారు కాలనీల్లో సమస్యలను పరిష్కరిస్తా'

హయత్‌నగర్: శివారు కాలనీల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించి మౌలిక సదుపాయాలు కల్పిస్తానని స్థానిక కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన డివిజన్‌లోని వెంకటాద్రినగర్, మధురానగర్, గాయిత్రీనగర్ కాలనీల్లో పర్యటించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మధురానగర్‌కాలనీలో తాగునీటి వ్యవస్థ, విద్యుత్ దీపాలు, సీసీరోడ్లు, ఇంటర్నల్ ఫోల్స్ సమస్యను పరిష్కరించాలని కాలనీ వాసులు కోరారు. వెంకటాద్రినగర్‌కాలనీలో భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ, వీధి దీపాలు, సీసీరోడ్లు ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో పలు కాలనీల సంక్షేమ సంఘం నాయకులు పాల్గొన్నారు.

పెద్దచెరువులో మురుగునీరు కలవకుండా చర్యలు



పెద్దచెరువులో మురుగునీరు చేరకుండా చర్యలు చేపడుతున్న హైడ్రా అధికారులు

మన్సూరాబాద్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): మన్సూరాబాద్ పెద్దచెరువులో మురుగునీరు కలవకుండా ఆదివారం హైడ్రా అధికారులు చర్యలు చేపట్టారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మన్సూరాబాద్ డివిజన్ ఆగమయ్యనగర్, హకీమాబాద్ కాలనీల వైపు భారీగా వరదనీరు రావడంతో అక్కడి కచ్చామోరీ కట్ట తెగి ఆ మురుగునీరు నేరుగా పెద్దచెరువులో కలుస్తుంది. విషయం తెలుసుకున్న స్థానిక కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి శనివారం ఆ ప్రాంతాన్ని పరిశీలించి హైడ్రా అధికారులకు ఫిర్యాదు చేసి చర్యలు తీసుకోవాలని కోరారు. తక్షణమే స్పందించిన అధికారులు ఆదివారం పెద్దచెరువులో మురుగునీరు కలవకుండా జేసీబీ, సిబ్బంది ద్వారా తాత్కాలిక చర్యలు చేపట్టారు.

ప్రజాసమస్యల పరిష్కారానికి ఐక్యవేదిక ఏర్పాటు

సైదాబాద్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): సైదాబాద్ డివిజన్‌లో అపరిష్కృత సమస్యల సాధనకై 18 కాలనీల ప్రతినిధులు ఏపీఏయూ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో అధ్యక్షుడు మడిగల విజయభాస్కర్‌రెడ్డి అధ్యక్షతన ఆదివారం ఐక్యవేదిక సమావేశం నిర్వహించారు. డివిజన్ అభివృద్ధికి ప్రజాప్రతినిధులు కృషి చేస్తున్నా అధికార యంత్రాంగం అలసత్వం వహిస్తున్నారని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. డివిజన్ రోడ్ల సమస్య, ఇళ్ల క్రమబద్ధీకరణ వంటి పలు పెండింగ్ సమస్యల పరిష్కారానికి నోచుకోవడం లేదని అన్నారు. ఐక్యవేదిక సమన్వయ కర్తగా కళ్యాణ్‌నగర్‌కాలనీ అధ్యక్షుడు గోవింద్‌రాజును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో కాలనీల ప్రతినిధులు కృష్ణారావు, మాల్యాద్రి శ్రీనివాస్, బిందు శ్రీనివాస్, భక్తవత్సలం, రాజేష్, సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యతో ఏదైనా సాధించవచ్చు

● ప్రముఖ రచయిత, సినీ నటుడు తనికెళ్ల భరణి



తనికెళ్ల భరణి, సమీర్ బన్సాల్‌లను శాలువాతో సన్మానిస్తున్న నిర్వాహకులు

మన్సూరాబాద్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): నాణ్యమైన విద్యతో విశ్వంలో ఏదైనా సాధించవచ్చని, విద్యార్థి దశలోనే విద్యను లక్ష్యాలకు పునాదిగా మలచుకోవాలని ప్రముఖ రచయిత, సినీనటుడు తనికెళ్ల భరణి పేర్కొన్నారు. నాగోల్‌లోని శుభం కన్వెన్షన్ సెంటర్‌లో ఆదివారం సౌందర్య గ్రూప్ బన్సాల్ క్లాసెస్ ఆధ్వర్యంలో 'సౌందర్య ఫెస్ట్-2కె25'ను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తనికెళ్ల భరణి, సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్ జేడీ లక్ష్మీనారాయణ, బన్సాల్ క్లాసెస్ చైర్మన్ సమీర్ బన్సాల్‌లు విచ్చేశారు. తనికెళ్ల భరణి మాట్లాడుతూ సూర్యోదయానికి ముందే నిద్రలేచిన వారు మాత్రమే చరిత్ర సృష్టించగలరన్నారు. లక్ష్యఛేదన పట్ల జేడీ లక్ష్మీనారాయణ విద్యార్థులనుద్దేశించి ఇచ్చిన పవర్‌పాయింట్ ప్రదర్శన అందరినీ ఆకట్టుకున్నాయి. బన్సాల్ జూనియర్ కాలేజ్ ఎండీ విశాల్ రంగినేని, చైర్మన్ తేజ్ ప్రశాంత్ రంగినేని, డైరెక్టర్ డాక్టర్ రమేష్ పాల్గొన్నారు.

సీతారాం ఏచూరి సంస్మరణ సభ

హయత్‌నగర్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): సీతారాం ఏచూరి ఆశయ సాధన కోసం వామపక్ష పార్టీలు కలిసి మతోన్మాద శక్తులను అడ్డుకోవాలని డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు కోటి రమేష్ అన్నారు. ఆదివారం ఉదయం హయత్‌నగర్ బస్‌డిపో వద్ద సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహించిన సీతారాం ఏచూరి సంస్మరణ సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, కృష్ణయ్య, మల్లేష్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ చోరీ.. వ్యక్తి అరెస్టు

చంపాపేట, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): సెల్‌ఫోన్ చోరీకి పాల్పడిన వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. కంచన్‌బాగ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని హఫీజ్ బాబానగర్‌లోని జాఫర్ ఇంట్లో డోర్ తెరిచి ఉండటంతో ఆదివారం తెల్లవారు జామున రూ.25వేల విలువైన వీవో సెల్‌ఫోన్ చోరీకి గురైంది. బాధితుడి ఫిర్యాదు మేరకు ఎస్ఐ రాజు ఆధ్వర్యంలో సీసీ కెమెరాల ఆధారంగా అదే కాలనీకి చెందిన ఇర్ఫాన్(24)అనే వ్యక్తిని అరెస్టు చేసి సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ఇన్‌స్పెక్టర్ కమల్‌కుమార్ తెలిపారు.

దిక్కూ మొక్కూ లేని మీర్‌పేట..!

- అధికారులు లేక పాలన అస్తవ్యస్తం
- ఆర్వో, ఎస్సై, మేనేజర్, ఏఈఈ పోస్టులు ఖాళీ
- టీపీవో వచ్చేది వారంలో రెండు రోజులే
- కింది స్థాయి సిబ్బందితోనే నెట్టుకొస్తున్న వైనం
- 50 రోజుల తర్వాత కమిషనర్ నియామకం

సరూర్‌నగర్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): సాధారణంగా అన్ని విభాగాల్లో అధికారులు, సిబ్బంది సరిపోయినంతగా ఉంటేనే పాలన అంతంత మాత్రంగా నడుస్తుందన్నది జగమెరిగిన సత్యం.. అలాంటిది ముఖ్యమైన విభాగాలన్నీ అధికారులు లేక ఖాళీగా ఉంటే పాలన ఎంత అస్తవ్యస్తంగా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు! ప్రస్తుతం మీర్‌పేట్ మునిసిపల్ కార్పొరేషన్‌లో అదే పరిస్థితి నెలకొంది. చెప్పుకోవడానికి 46 డివిజన్లు కలిగిన పెద్ద కార్పొరేషనే గానీ ఇక్కడ నాలుగైదు 'కుర్చీలు'(పోస్టులు) నెలల తరబడి ఖాళీగానే ఉండడం గమనార్హం! మునిసిపల్ శాఖ ఉన్నతాధికారులు, ప్రభుత్వంలోని నాయకులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో.. మీర్‌పేట్ పరిస్థితి దిక్కూ దివాణ లేని దివాలా కార్పొరేషన్‌గా మారిందనే వ్యాఖ్యలు వినవస్తున్నాయి.

మేనేజర్, ఆర్వో, ఎస్సై, ఏఈఈ పోస్టులు ఖాళీ

మీర్‌పేట్ కార్పొరేషన్ పాలనా వ్యవహారాలను పర్యవేక్షించే బాధ్యత గల మేనేజర్ పోస్టే ఖాళీగా ఉండడంతో ఇక్కడి పరిస్థితి గందరగోళంగా తయారయింది. గతంలో మేనేజర్‌గా పనిచేసిన చంద్రప్రకాశ్‌రెడ్డి జూన్ 24వ తేదీన ప్రభుత్వం చేపట్టిన సాధారణ బదిలీల్లో భాగంగా పదోన్నతిపై మేడ్చల్ కమిషనర్‌గా వెళ్లిపోవడంతో అప్పటి నుంచి ఇక్కడ మేనేజర్ పోస్టు ఖాళీగానే మిగిలిపోయింది. కార్యాలయంలోని ఓ సీనియర్ అసిస్టెంట్‌కు మేనేజర్ బాధ్యతలు అప్పగించి చేతులు దులుపుకున్నారు. పాలనపై సరైన అవగాహన లేని సీనియర్ అసిస్టెంట్ మేనేజర్‌గా ఎలా విధులు నిర్వర్తిస్తారో ఉన్నతాధికారులకే తెలియాలి అని పలువురు విమర్శలు గుప్పిస్తున్నారు. ఇక్కడ మరో విచిత్రమేమిటంటే సదరు సీనియర్ అసిస్టెంట్‌కే ఆర్వో(రెవెన్యూ ఆఫీసర్) బాధ్యతలు సైతం అప్పగించడం! ఇక్కడ గతంలో ఆర్వోగా పని చేసిన చంద్రశేఖర్‌రెడ్డికి సైతం జూన్ 24నాటి బదిలీల్లో భాగంగా ఏఎంసీగా పదోన్నతి కల్పించి బండ్లగూడ జాగీర్‌లో పోస్టింగ్ ఇచ్చారు. దాంతో సదరు రెండు ప్రధానమైన విభాగాలను ఓ సీనియర్ అసిస్టెంట్‌కు అప్పగించడంతో ఏ విభాగంలో ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొన్నది.

ఎస్సై లేక పేరుకుపోతున్న చెత్తాచెదారం

రాష్ట్ర ప్రభుత్వం గత జూన్ 2వ తేదీ నుంచి అట్టహాసంగా వంద రోజుల యాక్షన్ ప్లాన్ పేరుతో పలు కార్యక్రమాలు చేపట్టిన సంగతి విదితమే. ఈ కార్యక్రమంలో పారిశుధ్య విభాగంది ప్రత్యేక పాత్ర. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం, ఎప్పటికప్పుడు చెత్తను తొలగించడం, స్థానికులకు పరిశుభ్రతపై అవగాహన కల్పించడానికి సమావేశాలు నిర్వహించడం, డ్రైనేజీలు, మ్యాన్‌హోళ్లు క్లీన్ చేయడం వంటి అనేక బాధ్యతలు శానిటేషన్ ఇన్‌స్పెక్టర్(ఎస్సై)పై ఉంటాయి. అయితే మీర్‌పేట్‌లో రెండు నెలలుగా ఎస్సై లేకపోవడం గమనార్హం! గతంలో ఎస్సైగా పనిచేసిన రమేశ్ కూడా జూన్ 24 నాటి బదిలీల్లో భాగంగా పదోన్నతిపై సుల్తానాబాద్ కమిషనర్‌గా బదిలీపై వెళ్లిపోయారు. దాంతో అప్పటి నుంచి ఈ పోస్టు సైతం ఖాళీగానే ఉంది. అదే రోజు మీర్‌పేట్ ఏఎంసీగా బదిలీపై వచ్చిన సంరెడ్డి నాగేందర్‌రెడ్డికి విచిత్రంగా శానిటేషన్ బాధ్యతలు అప్పగించడం చర్చనీయాంశంగా మారింది. అసిస్టెంట్ మునిసిపల్ కమిషనర్ హోదా కలిగిన అధికారికి 'చెత్త'(పారిశుధ్య విభాగం) బాధ్యతలు అప్పగించడం పట్ల మునిసిల్ కార్యాలయంలోనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గత్యంతరం లేక ఆయన కార్యాలయంలోని మరో విభాగం ఉద్యోగిని సహాయకుడిగా పెట్టుకుని ఎలాగోలా శానిటేషన్ పనులు నెట్టుకొస్తున్నట్టు తెలిసింది. దాంతో మీర్‌పేట్‌లో వంద రోజుల ప్రణాళిక అస్తవ్యస్తంగా ముగిసింది.

కొసమెరుపు: ప్రధానమైన నాలుగైదు విభాగాల్లో కీలక పోస్టులన్నీ ఖాళీగా ఉండగా.. కొత్తగా బాధ్యతలు చేపట్టిన కమిషనర్ నాగమణి మీర్‌పేట్‌లోని అస్తవ్యస్త పాలనను ఏ మేరకు గాడిన పెడతారన్నది వేచి చూడాల్సిందే.!



ఏడు నెలలుగా ఏఈఈ పోస్టు ఖాళీ

మేనేజర్, ఆర్వో, ఎస్సై పోస్టులే కాదు.. దాదాపు ఏడు నెలలుగా ఇక్కడ ఇంజనీరింగ్ విభాగంలోని ఏఈఈ పోస్టు సైతం ఖాళీగానే ఉండడం మరో విచిత్రం! ఇక్కడ రూ.కోట్లలో అభివృద్ధి పనులు జరుగుతుంటాయి. వాటిని పర్యవేక్షించడానికి ఓ డీఈఈతో పాటు ఇద్దరు ఏఈఈలు అవసరం. కానీ మీర్‌పేట్‌లో కనీసం ఒక్క ఏఈఈ కూడా లేకపోవడం గమనార్హం! గతంలో ఏఈఈగా విధులు నిర్వర్తించిన శ్రీనివాస్ ఏడు నెలల క్రితం ఇక్కడి నుంచి బదిలీపై వెళ్లిపోవడంతో నాటి నుంచి ఈ పోస్టు ఖాళీగానే ఉంది. కేవలం ఒక్క డీఈఈ మాత్రమే మొత్తం ఇంజనీరింగ్ విభాగం వ్యవహారాలు చక్కబెట్టుకోవాల్సి వస్తోంది. దాంతో సరైన పర్యవేక్షణ లేక పెద్ద ఎత్తున నిధుల దుర్వినియోగం జరుగుతున్నట్టు ఆరోపణలు ఉన్నాయి.

టీపీవో వచ్చేది వారంలో రెండు రోజులే..!

మీర్‌పేట్ అంటేనే అక్రమ నిర్మాణాలకు పెట్టింది పేరు. అలాంటి మీర్‌పేట్‌కు పూర్తి స్థాయి టీపీవో ఉంటేనే వాటికి ఎంతో కొంత అడ్డుకట్ట పడుతుంది. కానీ ఇక్కడ డిప్యుటేషన్ మీద వచ్చిన టీపీవోనే ఉండడం విచిత్రం. వికారాబాద్ టీపీవోగా ఉన్న ఓ మహిళా అధికారికి మీర్‌పేట్‌తో పాటు పోచారం మునిసిపాలిటీ బాధ్యతలు సైతం అప్పగించారు. దాంతో ఆమె వారంలో రెండేసి రోజులు సదరు మూడు ప్రాంతాలకు కేటాయిస్తున్నారు. ఆ రెండు రోజుల్లో ఏవైనా సెలవులు వస్తే ఇక అంతే సంగతులు..! మీర్‌పేట్‌కు సోమ, మంగళవారాల్లో ఆమె వస్తుంటారు. అయితే అక్రమ నిర్మాణాలపై చూసీ చూడనట్టు వ్యవహరిస్తూ, తన టేబుల్‌పై పెట్టిన ఫైల్స్ మీద సంతకాలు పెట్టి వెళ్లిపోతున్నారనే విమర్శలు వినవస్తున్నాయి. టౌన్ ప్లానింగ్ సెక్షన్‌లోని కింది స్థాయి సిబ్బంది 'అక్రమ నిర్మాణాల' వ్యవహారాలన్నీ చక్కబెట్టి టీపీవో చేతికి మట్టి అంటకుండా 'కవర్' చేసుకుంటున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మీర్‌పేట్‌లో లెక్క లేనన్ని అక్రమ నిర్మాణాలు, బహుళ అంతస్తుల భవన నిర్మాణాలు యథేచ్ఛగా కొనసాగుతుండగా, సదరు నిర్మాణదారుల నుంచి టౌన్‌ప్లానింగ్ సిబ్బంది పెద్ద మొత్తంలో వసూళ్లు చేసి, తలా కొంత పంచుకుంటున్నారని స్థానికులు విమర్శిస్తున్నారు. దాంట్లో మునిసిపల్ ఉన్నతాధికారులకు సైతం వాటా ఉంటుందన్నది జగమెరిగిన సత్యం!

ఎట్టకేలకు కమిషనర్ నియామకం

మీర్‌పేట్ మునిసిపల్ కమిషనర్ జ్ఞానేశ్వర్ గత జూన్ 30వ తేదీన పదవీ విరమణ పొందడంతో 50 రోజుల నుంచి ఇక్కడ కమిషనర్ పోస్టు సైతం ఖాళీగానే ఉంది. తుక్కుగూడ కమిషనర్ వాణీరెడ్డికి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించగా ఆమె అప్పుడప్పుడు వచ్చి వెళ్లేవారు. ఎట్టకేలకు మీర్‌పేట్ కమిషనర్‌గా ఇటీవల ప్రభుత్వం నాగమణిని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేయగా ఆమె ఇక్కడ బాధ్యతలు స్వీకరించారు.



బాలకృష్ణ పార్థివ దేహానికి నివాళులర్పిస్తున్న మధుయాష్కీగౌడ్

మావోయిస్ట్ నేతకు నివాళి

చాదర్‌ఘాట్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మావోయిస్ట్ పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు మోడెం బాలకృష్ణ పార్థివ దేహానికి టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మాజీ ఎంపీ మధుయాష్కీగౌడ్ ఆదివారం నివాళులర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద కుటుంబంలో పుట్టిన బాలకృష్ణ ఆరోజుల్లోనే ఇంజనీరింగ్ చదివి నక్సలిజం వైపు ఆకర్షితులయ్యారన్నారు. మావోయిస్ట్ ఉద్యమంలో చేరి ప్రజల కోసం తన జీవితాన్ని త్యాగం చేశారన్నారు. మావోయిస్టులంటే ఉగ్రవాదులు కాదని సమాజంలో దోపిడీ, అన్యాయాలను ప్రశ్నించే వారన్నారు. మావోయిస్టులు అడుగుతున్న ప్రజలకు సామాజిక ఆర్థిక న్యాయం లాంటి సమస్యలను పరిష్కరించకుండా వారిని లేకుండానే చేయాలని కేంద్ర ప్రభుత్వం ఆలోచన దుర్మార్గమన్నారు. చర్చలకు సిద్ధమని చెప్పినా వారిని పిలవకుండా ఆపరేషన్ కగార్ పేరుతో మావోయిస్టులను అంతమొందించడమే లక్ష్యంగా కేంద్రంలోని ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్‌షాలు వ్యవహరిస్తున్న తీరు తీవ్ర ఆక్షేపనీయమన్నారు. 2026 మార్చి 31 వరకు మావోయిస్టులు లేకుండా ఏరవేస్తామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించడం దుర్మార్గమన్నారు. వెంటనే ఆపరేషన్ కగార్‌ను ఆపాలని మావోయిస్టులను చర్చలకు పిలవాలని ఆయన డిమాండ్ చేశారు.

తెలంగాణ కేంద్ర మాజీ సాయుధ పోలీస్ బలగాల

సంఘం భవనానికి స్థలం కేటాయించండి

● ఎమ్మెల్యే సబితకు సంఘం ప్రతినిధుల వినతి



ఎమ్మెల్యే సబితారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న శ్యాంసుందర్‌రెడ్డి, యాదగిరిరెడ్డి తదితరులు

సరూర్‌నగర్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): తెలంగాణ కేంద్ర మాజీ సాయుధ పోలీసు బలగాల(ఎక్స్- సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీసు ఫోర్సెస్) సంఘం కార్యాలయం భవనం కోసం బడంగ్‌పేట్, మీర్‌పేట్ కార్పొరేషన్ల పరిధిలో అనువైన స్థలం కేటాయించాల్సిందిగా సంఘం ప్రతినిధులు మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డిని కోరారు. ఈ మేరకు ఆదివారం జిల్లెలగూడలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆమెను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు కె.శ్యాంసుందర్‌రెడ్డి, ప్రతినిధి యాదగిరిరెడ్డి మాట్లాడుతూ స్థలం కోసం తాము ఆరేడు సంవత్సరాలుగా విన్నవించుకుంటున్నామని, అయినా ఇంత వరకు తమ సమస్య పరిష్కారం కాలేదని పేర్కొన్నారు. మీర్‌పేట్, బడంగ్‌పేట్ కార్పొరేషన్లతో పాటు నియోజకవర్గంలోని ఇతర ప్రాంతాల్లో తమ మాజీ ఉద్యోగుల కుటుంబాలు అధిక సంఖ్యలో ఉన్నాయని, వారందరికీ సభలు, సమావేశాలు నిర్వహించుకోవడానికి ప్రత్యేకంగా భవనం లేకపోవడంతో ప్రైవేటు హాల్‌లను ఆశ్రయించాల్సి వస్తోందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ బాలాపూర్ మండలంలోని కుర్మల్‌గూడలో గల ప్రభుత్వ భూమిలో నుంచి కొంత స్థలం కేటాయించడానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు వి.యాదయ్య, టి.రాజారత్నం, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

కుంగిన మ్యాన్‌హోల్‌కు మరమ్మతులు ప్రారంభం



కుంగిన మ్యాన్‌హోల్‌కు మరమ్మతులు చేపట్టిన జలమండలి అధికారులు

హయత్‌నగర్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): రెండు రోజుల క్రితం కురిసిన భారీ వర్షానికి మన్సూరాబాద్ డివిజన్ హయత్‌నగర్‌లోని ఆర్టీసీ కాలనీలో కుంగిన మ్యాన్‌హోళ్ల మరమ్మతు పనులను జలమండలి అధికారులు ఆదివారం చేపట్టారు. మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి అధికారుల దృష్టికి తీసుకుపోవడంతో అధికారులు మరమ్మతులు ప్రారంభించారు. కార్పొరేటర్ ఆదివారం దగ్గరుండి మరమ్మతు పనులను పరిశీలించారు. ఆర్టీసీ కాలనీలోని రోడ్డు నంబర్ 4 వద్ద ఓ మ్యాన్‌హోల్ కుంగి సుమారు 15ఫీట్ల లోతు వరకు గుంత ఏర్పడింది. దీంతో వినాయకనగర్, లెక్చరర్స్ కాలనీతో పాటు చుట్టు ఉన్న పలు కాలనీలకు డ్రైనేజీ సమస్య ఏర్పడింది. మురుగునీరు మొత్తం రోడ్లపైకి చేరింది. మురుగునీరు లోతట్టు ప్రాంతంలో చేరి చెరువును తలపించింది. అధికారులు లైన్ డైవర్షన్ చేసి కుంగిన చోట కొత్త మ్యాన్‌హోల్ నిర్మాణాన్ని చేపట్టారు. ఒకటి రెండు రోజుల్లో మ్యాన్‌హోల్ పనులు పూర్తి చేసి సమస్యను పరిష్కరిస్తామని జలమండలి ఏఈ రాజు తెలిపారు. కార్యక్రమంలో రాజేంద్రబాబు, కాలనీ నాయకులు శంకర్‌రెడ్డి, లక్ష్మన్‌గౌడ్, రుక్మారెడ్డి, గుర్రం బాల్‌రెడ్డి పాల్గొన్నారు.

సంప్రదాయాలు కాపాడుతూనే విద్యలో రాణించాలి

● బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు



బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావును సత్కరిస్తున్న అహోబిల జీయర్‌స్వామి, ఎస్‌వీఎస్ఎస్ కార్యవర్గ సభ్యులు

మన్సూరాబాద్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): సంప్రదాయాలను కాపాడాల్సిన బాధ్యత భవిష్యత్తు తరాలపైన ఉందని, హిందూ సంప్రదాయా న్ని కాపాడుతూనే విద్యలో ఉన్నతులుగా రాణించాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు పేర్కొన్నారు. ఎల్బీనగర్‌లోని చంద్రపురికాలనీలోని శ్రీవైష్ణవ సేవా సంఘం కార్యాలయంలో ఎస్‌వీఎస్ ట్రస్టు ఆధ్వర్యంలో శనివారం రాత్రి పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో ప్రతిభకనబరిచిన విద్యార్థులతో పాటు విశిష్ట మహిళా, విశిష్ట వ్యక్తి, దేశికోత్తమ పురస్కారాలు అందజేశారు. త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ అహోబిల జీయర్‌స్వామి పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమానికి ము ఖ్యఅతిథిగా రామచందర్‌రావు విచ్చేశారు. విశిష్ట వ్యక్తి పురస్కారం ప్ర ముఖ సినీ నిర్మాత డా.వేదాల శ్రీనివాసు, విశిష్ట మహిళా పురస్కారం కండ్లకుంట కమల, విశిష్ట సాహితీ పురస్కారం మరింగంటి కులశేఖరాళ్వారాచార్యులు, దేశికోత్తమ పురస్కారాలు బీఆర్ఎస్ రాఘవాచార్యులు, కేఎస్ అనంతాచార్యులు అందుకున్నారు. ఈ సందర్భంగా అహోబిల జీయర్ స్వామి ప్రవచనాలు అందరిలో ప్రేరణకలిగించాయి. కార్యక్రమం లో బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు వనిపల్లి శ్రీనివాస్‌రెడ్డి, జీహెచ్ఎంసీ బీజేపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కొప్పుల నర్సింహారెడ్డి, ఎస్‌వీఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఏవీఎల్ఎన్ చార్యులు, గౌరవాధ్యక్షుడు కండ్లకుంట యాదగిరాచార్యులు, ప్రధాన కార్యదర్శి దరిపల్లి వెంకటరమణ, ట్రెజరర్ కేవీఆర్ ప్రసాద్. మునగాల హరీష్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉపాధ్యాయులను గౌరవించుకోవడం అందరి బాధ్యత

● శాసన మండలి ప్రతిపక్ష నేత మధుసూదనాచారి

మన్సూరాబాద్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులను గౌరవించుకోవడం అందరి బాధ్యత అని శాసనమండలి ప్రతిపక్షనేత, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి పేర్కొన్నారు. వైశ్య వికాస వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ కాచం సత్యనారాయణగుప్తా ఆధ్వర్యంలో ఆదివారం మన్సూరాబాద్‌లోని ఓ హోటల్‌లో గురుపూజోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మధుసూదనాచారి విచ్చేసి కాచం సత్యనారాయణతో కలిసి సుమారు 80మంది ఉపాధ్యాయులను సన్మానించి మెమెంటోలను అందజేశారు. కార్యక్రమంలో కాచం సుష్మా, వైశ్య వికాస వేదిక సభ్యులు నంగునూరి రమేష్, కొత్త రవి, కాచం ఏక్‌సాయి, వంగవీటి శ్రీనివాస్, కోడుమూరి దయాకర్, సత్యనారాయణ, రమేష్, మురళి పాల్గొన్నారు.

సీసీ కెమెరాలు ప్రారంభం

సరూర్‌నగర్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): మీర్‌పేట్ కార్పొరేషన్‌లోని 8వ డివిజన్‌లో కాలనీవాసులు ఏర్పాటు చేసుకున్న సీసీ కెమెరాలను ఆదివారం మీ ర్‌పేట్ ఇన్‌స్పెక్టర్ శంకర్‌నాయక్, మాజీ కార్పొరేటర్ కీసరి హరినాథ్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి కాలనీలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉన్నదని, నేరాలు జరిగినప్పుడు నిందితులను గుర్తించడంలో ఇవి ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. కార్యక్రమంలో స్థానిక కాలనీల ప్రతినిధులు రామకృష్ణారెడ్డి, లక్ష్మణాచారి, నర్సింహులు, భిక్షపతిరెడ్డి, అంజయ్య, మాణిక్‌ప్రభు, శివశంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

సెప్టెంబరు 17ను విమోచనా దినోత్సవంగా జరుపుకోవాలి

సరూర్‌నగర్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): నిజాం నిరంకుశ పాలన నుంచి తెలంగాణకు స్వేచ్ఛ లభించిన సెప్టెంబరు 17వ తేదీని తెలంగాణ విమోచనా దినోత్సవంగా ఘనంగా జరుపుకోవాలని బీజేపీ కిసాన్ మోర్చా జాతీయ నాయకుడు వి.పాపయ్యగౌడ్ సూచించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో పాల్గొని విమోచన దినోత్సవంపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఆయన అన్నారు. మీర్‌పేట్‌లోని నందిహిల్స్‌లో శనివారం రాత్రి పార్టీ మీర్‌పేట్ క్లస్టర్-1 అధ్యక్షుడు పసునూరి భిక్షపతిచారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సేవా పక్వాడా కార్యశాలలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో బీజేపీ మీర్‌పేట్ శాఖ ప్రధాన కార్యదర్శులు తిరుపతిరెడ్డి, ఇంద్రావత్ రవినాయక్, జిల్లా కౌన్సిల్ సభ్యుడు ముత్తంగి కరుణానిధి, సేవా పక్వాడా కన్వీనర్ రాజశేఖర్, కోకన్వీనర్ కృష్ణారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

ఆలిండియా బంజారా సేవా సంఘంలో మీర్‌పేట్ నేతలు

సరూర్‌నగర్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): ఆలిండియా బంజారా సేవా సం ఘంలో మీర్‌పేట్ కార్పొరేషన్‌కు చెందిన ఇద్దరు బీజేపీ నాయకులకు చోటు ద క్కింది. సంఘం మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలిగా మాజీ కార్పొరేటర్ నీలా రవినాయక్ నియమితులయ్యారు. ఈ మేరకు సంఘం జాతీయ అధ్యక్షుడు, మాజీ ఎంపీ ఉమేశ్ జాదవ్ జారీ చేసిన నియామక ఉత్తర్వులను ఆదివారం సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ రాములునాయక్ చేతుల మీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తిస్తూ బంజారాల సంక్షేమానికి కృషి చేస్తామని పేర్కొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో యువకుడి ఆత్మహత్య

అబ్దుల్లాపూర్‌మెట్: ఆర్థిక ఇబ్బందులతో యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండల పరిధిలోని కవాడిపల్లిలో ఆదివారం జరిగింది. వివరాల ప్రకారం.. ఒడిశా రాష్ట్రంలోని బీంపూర్‌కు చెందిన సుబ్రత్‌జీనా కొంత కాలం క్రితం వలస వచ్చి నగర శివారులోని కవాడిపల్లిలో నివాసం ఉంటున్నాడు. స్థానికంగా ఉన్న జీఎస్‌పీ కంపెనీలో కూలీ పనులు చేస్తూ భార్య, ఇద్దరు కుమారులతో కలిసి ఉంటున్నాడు. అతడి పెద్ద కుమారుడు సుకమల్ జైన్(20) కూడా అదే కంపెనీలో పని చేస్తున్నాడు. కాగా ఆదివారం ఉదయం ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన సుకమల్ జైన్ సమీపంలోని ఓ చెట్టుకు లుంగీతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. చెట్టుకు వేలాడుతున్న సుకమల్‌ను చూసిన స్థానికులు సుబ్రత్‌జీనా, పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే అక్కడికి చేరుకున్న పోలీసులు పంచనామా అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఆర్థిక ఇబ్బందులతోనే తన కుమారుడు మృతిచెందాడని మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సెప్టెంబరు 17ను సాయుధ పోరాట దినోత్సవంగా నిర్వహించాలి

● సీపీఐ జాతీయ కార్యదర్శి, మాజీ ఎంపీ అజీజ్‌పాషా



మాట్లాడుతున్న మాజీ ఎంపీ అజీజ్‌పాషా, గోపాల్, నర్సింహ

ఎల్బీనగర్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): సెప్టెంబర్ 17ను తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట దినోత్సవంగా ప్రభుత్వమే అధికారికంగా నిర్వహించాలని సీపీఐ జాతీయ కార్యదర్శి, రాజ్యసభ మాజీ సభ్యుడు అజీజ్‌పాషా డిమాండ్ చేశారు. సీపీఐ సరూర్‌నగర్ మండల సమితి ఆధ్వర్యంలో సరూర్‌నగర్ డివిజన్ పరిధిలోని భగత్‌సింగ్‌నగర్‌లో జరిగిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరితో పాటు తెలంగాణ ప్రాంత విముక్తి కోసం కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో మట్టి మనుషులంతా ఏకమై దొరలు, భూస్వాములు, జాగీర్దార్లకు వ్యతిరేకంగా ఉద్యమించి గడీలను బద్దలు కొట్టి తరిమి కొట్టిన మహోత్తర ఉద్యమం తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటమన్నారు. అలాంటి వీర తెలంగాణ పోరాట నేటి తరాలకు అందించాల్సిన ప్రభుత్వాలు సమైక్య దినోత్సవమంటూ, ప్రజాపాలన దినోత్సవమంటూ రకరకాల పేర్లతో వేడుకలు జరపడమేమిటని ఆయన ప్రశ్నించారు. నాటి సాయుధ పోరాటమే లేకపోతే నేడు తెలంగాణ రాష్ట్రమే ఉండేది కాదన్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం సెప్టెంబరు 17న తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట దినోత్సవం పేరిట ఉత్సవాలు నిర్వహించాలన్నారు. సాయుధమని పలికేందుకే భయమైతే తెలంగాణ రైతాంగ పోరాట దినోత్సవంగా వేడుకలు నిర్వహించాలని ఆయన సూచించారు. ఈ ఉత్సవాలను అధికారికంగా నిర్వహిస్తే ప్రభుత్వానికి, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి మంచి పేరు గుర్తింపు వస్తుందని ఆయన సూచించారు. అదేవిధంగా నాటి సమరయోధుల త్యాగాలతో పాటు వారి చరిత్ర భావితరాలకు అందించేందుకు హైదరాబాద్‌లో ప్రత్యేక మ్యూజియం ఏర్పాటు చేయడంతో పాటు ఈ పోరాటానికి నాయకత్వం వహించిన బద్దం ఎల్లారెడ్డి, రావి నారాయణరెడ్డి, ఆరుట్ల రామచంద్రారెడ్డి, చాకలి ఐలమ్మ, కమలాదేవి, ధర్మభిక్షం లాంటి మహానేతల విగ్రహాలను ట్యాంక్‌బండ్‌పై కానీ ప్రధాన ప్రాంతాల్లో కానీ ఏర్పాటు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీపీఐ రంగారెడ్డి జిల్లా కార్యవర్గసభ్యుడు బాతరాజు నరసింహ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మాజీ సర్పంచ్ గోపాల్, సీపీఐ, ఎస్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కర్ణాకర్‌రెడ్డి, సీపీఐ రంగారెడ్డి జిల్లా సమితి సభ్యుడు జిల్లాల కృష్ణ, మహబూబ్, కమలమ్మ, రమావత్, సక్రునాయక్, సీపీఐ నాయకులు ఇస్తారి, ఇద్రిస్‌బాయ్, నూర్జహాన్, నర్సమ్మ పాల్గొన్నారు.

కమ్యూనిస్టుల పోరాటంతోనే నిజాం పాలనకు చరమగీతం

మన్సూరాబాద్ : తెలంగాణ సాయుధ పోరాటంలో నిజాం నిరంకుశ పాలనకు చరమగీతం పాడటంలో కమ్యూనిస్టుల పాత్ర ఎనలేనిదని సీపీఐ జాతీయ కార్యదర్శి అజీజ్ పాషా పేర్కొన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట మహోత్సవాల సభను సీపీఐ ఆధ్వర్యంలో మన్సూరాబాద్‌లో ఘనంగా నిర్వహించారు. సీపీఐ మన్సూరాబాద్ కార్యదర్శి కందుల సుధాకర్, అజీజ్ పాషాతో పాటు రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆందోజు రవీంద్రాచారిలు విచ్చేసి మన్సూరాబాద్ చౌరస్తా వద్ద సీపీఐ జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పామిడి శేఖర్‌రెడ్డి, బోయపల్లి రాములుగౌడ్, శ్రీదేవి, పామిడి వంశీవర్ధన్‌రెడ్డి, అరుణ్‌గౌడ్ పాల్గొన్నారు.